సాక్షి నంద్యాల

మంగళవారం ; 26 ; మార్చి ; 2024



మల్లన్నకు వెండి రథోత్సవం

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం వెండి రథోత్సవాన్ని నిర్వహించారు. ముందుగా ఉత్సవమూర్తులకు సహస్రదీపార్చన సేవ చేపట్టారు.



తేరుపై తేజోరూపం

ఆదోని రూరల్: నంతెకూడ్లూరు గ్రామంలో సోమవారం రతీమన్మథుల రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం పురుషులు ఆడ వేషంలో అలరించనున్నారు.



రంగంలోకి ఎన్నికల బృందాలు

ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, స్వేచ్ఛాయుతంగా నిర్వహించేందుకు అధికార బృందాలు రంగంలోకి దిగాయి. రాజకీయ పార్టీల ప్రచార కార్యక్రమాలను పరిశీలిస్తున్నాయి. 8లో▸

రంజాన్ వేళలు

	ఇఫ్తార్	సహెర్
కర్నూలు	సా॥ 6:34	ఉ॥ 4:53
ఆదోని	సా॥ 6:37	ఉ॥ 4:56
నంద్యాల	సా॥ 6:34	ఉ॥ 4:50
ఆత్మకూరు	సా॥ 6:32	ఉ॥ 4:51
బనగానపల్లె	సా॥ 6:35	ఉ॥ 4:51

హదీస్ వెలుగు :

ఇఫ్తార్ సమయంలో "యా వాసియల్ ఫజ్లి యగ్ ఫిర్లి, అస్తగ్ ఫిరుల్లాహ్" అధికంగా జపించండి. దీనివల్ల మీ పాపాలను అల్లాహ్ దహించివేస్తారు. - పవిత్ర ఖురాన్

న్యూస్‌రీల్

శ్రీశైలంలో భక్తుల రద్దీ



మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

శ్రీశైలం టెంపుల్: శ్రీశైల శ్రీ భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్ల క్షేత్రంలో భక్తుల రద్దీ నెలకొంది. సోమవారం పరమేశ్వరుడుకి ప్రీతికరమైన రోజు కావడంతో ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు శ్రీగిరి చేరుకుని స్వామి అమ్మ వార్లను దర్శించుకున్నారు. వేకువ జామున పాతాళ గంగలో పుణ్య స్నానాలు ఆచరించిన భక్తులు మల్లన్న దర్శనానికి బారులుదీరారు.

హోలీ సంబరాలు



ఎస్పీకి రంగుల తిలకం దిద్దుతున్న కమాండెంట్ బాన్‌లాల్ శ్యామ్

బొమ్మలసత్రం: నంద్యాల జిల్లా ఎస్పీ కార్యాలయంలో కేంద్ర బలగాల కమాండెంట్‌ల ఆధ్వర్యంలో హోలీ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి హాజరై వేడుకలను ప్రారంభించి మిఠాయిలు తినిపించారు. కేంద్ర బలగాల కమాండెంట్ బాన్‌లాల్ శ్యామ్, డిప్యూటీ కమాండెంట్ నీరజ్ కుమార్, అసిస్టెంట్ కమాండర్ అజయ్ కుమార్‌ల ఆధ్వర్యంలో హోలీని ఘనంగా జరుపుకున్నారు.

గురుకులాల్లో 6లోగా ప్రవేశం పొందండి

నంద్యాల(న్యూటౌన్): ఉమ్మడి కర్నూలు జిల్లాలోని ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ అంబేద్కర్ గురుకులాల్లో ఏప్రిల్ 6వ తేదీలోగా ప్రవేశాలు పొందాలని ఏపీఎస్‌డబ్ల్యూఆర్‌ఐఎస్ కోఆర్డినేటర్ డా.ఐ శ్రీదేవి సోమవారం తెలిపారు. 5వ తరగతి పరీక్ష రాసిన విద్యార్థుల్లో వారు పొందిన మార్కులు, సీట్ల సంఖ్య ఆధారంగా ప్రవేశాల ఎంపికను తాడేపల్లిలోని ప్రధాన కార్యాలయం విడుదల చేసిందన్నారు. కర్నూలు జిల్లాలో 560 సీట్లకు (బాలురు 80, బాలికలు 480), నంద్యాల జిల్లాలో 560 సీట్లకు (బాలురు 160, బాలికలు 400) మందిని ఫేజ్ -1 కింద ఎంపిక చేశారన్నారు. అలాట్మెంట్ ఆర్డర్‌ను https://apbragcet.apcfss. inలో డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

సమయం లేదు మిత్రమా!!

కౌంట్‌డౌన్ మొదలైంది.. 23 రోజుల్లో నామినేషన్లు.. 48 రోజుల్లో పోలింగ్ ఉండటంతో అభ్యర్థులు వేగంగా పావులు కదుపుతున్నారు. రెండు స్థానాల్లో టీడీపీ మినహా తక్కిన అన్ని స్థానాలకు అధికార, ప్రతిపక్ష పార్టీలు అభ్యర్థులను ఖరారు చేశాయి. ఈ నేపథ్యంలో నామినేషన్‌కు ముందే ప్రచార పర్వాన్ని హోరెత్తిస్తున్నారు. నగదు సేకరణ, మద్యంతో పాటు ఎన్నికలకు అవసరమైన అన్ని రకాల సరంజామాను సమకూర్చుకుంటున్నారు. గత సార్వత్రిక ఎన్నికలతో పోలిస్తే సమయం ఎక్కువ ఉండటంతో నియోజకవర్గంలోని అన్ని గ్రామాల్లో ప్రచారం చేయాలని ఆలోచన కనిపిస్తోంది. ఇదే సమయంలో అసంతృప్తులను బుజ్జగించి దారికి తెచ్చుకోవడంతో పాటు పార్టీలో చేరికలతో తలమునకలవుతున్నారు. ద్వితీయ శ్రేణి, గ్రామస్థాయి నా యకుల హడావుడి ఓ స్థాయిలో సాగుతోంది.



బనగానపల్లెలో ఇటీవల నిర్వహించిన సిద్ధం సభలో ప్లకార్డులు ప్రదర్శిస్తున్న మహిళలు(ఫైల్)

ఎన్నికలకు 48 రోజులు మాత్రమే గడువు

- అభ్యర్థులపై స్పష్టత రావడంతో నగదు సేకరణపై దృష్టి
- మద్యం కోసం ఇప్పటికే పొరుగు రాష్ట్రంలోని దుకాణదారులతో సంప్రదింపులు
- టీడీపీ నేతలకు చేరిన డబ్బు మూటలు
- నామినేషన్‌కు ముహూర్తాలు చూసుకుంటున్న అభ్యర్థులు
- ఇప్పటికే హోరెత్తుతున్న ప్రచారపర్వం
- ఈ నెల 28, 29లో నంద్యాల, కర్నూలు జిల్లాల్లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బస్సుయాత్ర
- 29న శ్రీశైలం, నందికొట్కూరు, కర్నూలులో చంద్రబాబు పర్యటన



సాక్షి ప్రతినిధి కర్నూలు: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రెండు ఎంపీ, 14 అసెంబ్లీ స్థానాలకు అభ్యర్థులను ప్రకటించింది. టీడీపీ 12 అసెంబ్లీ, రెండు ఎంపీ స్థానాలకు అభ్యర్థులను ఖరారు చేసింది. ఆలూరు, ఆదోని స్థానాలపై స్పష్టత కొరవడింది. పొత్తులో భాగంగా ఆదోని నుంచి బీజేపీ అభ్యర్థి పోటీ చేసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఆలూరులో పీఠముడి వీడటం లేదు. ఓవైపు ఎన్నికల గడువు ముంచుకొస్తుండటంతో అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. ముఖ్యంగా అభ్యర్థులు ఖరారైన రోజు నుంచి ప్రచారం మొదలవడంతో మే 13 పోలింగ్ జరిగే వరకు రోజూ డబ్బుతోనే పని. దీంతో నాయకుల దృష్టి దాదాపుగా అటువైపే ఉంది. తెలుగు దేశంపార్టీ అభ్యర్థులకు ఇప్పటికే డబ్బు మూటలు చేరినట్లు తెలుస్తోంది. విరాళాలపై కూడా దృష్టి సారించారు. పరిచయం ఉన్న వారందరి జాబితా సిద్ధం చేసి డబ్బు కూడగడుతున్నారు. కుల సంఘాలను కూడా ఇందుకోసం వినియోగించుకుంటున్నారు. ఆయా సామాజికవర్గాల్లో ఆర్థికంగా బలంగా ఉన్న నేతల ఇళ్లవద్దకు అభ్యర్థులు వెళ్లి ఆర్థికసాయంతో పాటు ఎన్నికలకు సహకరించాలని అభ్యర్థిస్తున్నారు.


ఐదేళ్ల సంక్షేమం, అభివృద్ధితో పాటు మాట చెబితే కచ్చితంగా చేస్తాడనే 'క్రెడిబులిటీ' తమను గెలిపిస్తుందనే ధీమాతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు ఉన్నారు. మరోవైపు చంద్రబాబు 2014 ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలులో వైఫల్యంతో పాటు 'క్రెడిబులిటీ' లేకపోవడం ఆపార్టీ అభ్యర్థులకు సమస్యగా మారింది. పైగా కర్నూలు, నంద్యాల జిల్లాల్లో టీడీపీ గత 20 ఏళ్లుగా అత్యంత బలహీనంగా ఉంది. దీంతో ఎన్నికల్లో పోటీ చేసేందుకు కూడా అభ్యర్థులు ముందుకు రాలేదు. సీట్ల కేటాయింపు కూడా ఇప్పటి వరకూ కొలిక్కి రాలేదు. పైగా పొత్తుతో ఏర్పడిన కూటమి. ఇది ఆ పార్టీకి ముళ్ల కిరీటంలా మారింది. ఎక్కడా సయోధ్య లేక విభేదాలతో అభ్యర్థులు సతమతమవుతున్నారు. ముఖ్యంగా ఆళ్లగడ్డ, నంద్యాల, డోన్, ఎమ్మిగనూరు, ఆదోని, ఆలూరు, మంత్రాలయం, కోడుమూరు నియోజకవర్గాల్లో టీడీపీ నేతల మధ్య ఉన్న విభేదాలు అభ్యర్థులకు తలనొప్పిగా మారాయి. ఈ కారణంగా టీడీపీ అభ్యర్థుల్లో దూకుడు కరువైంది. వీరంతా 'డబ్బు' ప్రధాన అస్త్రంగా ఎన్నికల బరిలోకి దిగనున్నారు. కర్నూలు, బనగానపల్లి, పత్తికొండ, ఆళ్లగడ్డతో పాటు చాలా నియోజకవర్గాల్లో టీడీపీ నేతలు విచ్చలవిడిగా డబ్బు ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యారు. నందికొట్కూరులో టీడీపీ ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి చీరలు పంపిణీ చేశారు. హాట్‌బాక్స్‌లు, కుక్కర్లు, ముక్కుపుడకలు, చీరలు ఇలా ఎక్కడికక్కడ తాయిలాల పంపిణీలో తలమునకలయ్యారంటే ఏస్థాయిలో ఖర్చు చేసేందుకు సిద్ధమయ్యారో తెలుస్తోంది. టీడీపీలో టిక్కెట్ ఆశించి భంగపడ్డ వారిని డబ్బుతోనే సంతృప్తిపరుస్తున్నారు. ఆ పార్టీ ఒక్కో నియోజకవర్గంలో సగటును రూ.25-30కోట్లకు తక్కువ లేకుండా ఖర్చు చేస్తున్నట్లు సమాచారం. కర్నూలు, బనగానపల్లిలో రూ.50కోట్లకుపైగా ఖర్చు చేస్తున్నట్లు చర్చ జరుగుతోంది. దీంతో ఆయా నియోజకవర్గాల్లో ఈ ఎన్నికలే ఖరీదైనవిగా నిలిచిపోనున్నాయి. ఎన్నికల్లో ఓటుకు రూ.వెయ్యి నుంచి 2వేల వరకూ పంచేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మండలాలు, గ్రామాల వారీగా డబ్బును ఇప్పటికే సన్నిహితుల ఇళ్లకు చేరుస్తున్నారు. నగదు తక్కువగా ఉన్న అభ్యర్థులు సన్నిహితులకు ఫోన్లు చేసి నగదు ఎంత ఉంటే అంత తీసుకురావాలని, ఈ దఫా ఎన్నికల్లో ఖర్చు ఎంతవుతుందో లెక్కగట్టలేమని, కాబట్టి ముందుజాగ్రత్తగా ఉండటం మంచిదని జాగ్రత్తపడుతున్నారు.

నామినేషన్‌ల కంటే ముందే ఊపందుకున్న ప్రచారం



కోవెలకుంట్లలో కాటసాని రామిరెడ్డి తరఫున ప్రచారం చేస్తున్న కోడలు, కుమార్తె

నామినేషన్లకు ఏప్రిల్ 18న నోటిఫికేషన్ విడుదల కానుంది. మే 13న పోలింగ్. దీంతో గడువు ఎక్కువగా ఉంది. అర్బన్ మినహా ప్రతీ నియోజకవర్గంలో సగటున 6 మండలాలు ఉన్నాయి. సగటున ప్రతీ మండలంలో 8 రోజులు తిరిగేందుకు సిద్ధమయ్యారు. నామినేషన్లకు ముందే అభ్యర్థులు ప్రచార పర్వాన్ని సాగిస్తున్నారు. కొందరు నేతలు జ్యోతిష్యులను సంప్రదించి నామినేషన్లకు ముహూర్తాలను చూసుకుంటున్నారు. నామినేషన్ల పత్రాలు సిద్ధం చేసే బాధ్యతలను సన్నిహితులకు అప్పగించారు. ప్రచార వాహనాలకు కూడా ఇప్పటికే ఆయా పార్టీల స్టిక్కరింగ్ వేయించారు. ఆటోలను కూడా తిప్పుతున్నారు. బంధువులు, పిల్లలను కూడా 'ఎన్నికల పండుగ'కు ఆహ్వానించారు. మే 13 పోలింగ్ వరకు వీరిని కూడా ప్రచారంలో భాగస్వాములను చేసి 'సకుటుంబ సపరివార సమేతం'గా ప్రచారాన్ని నిర్వహించనున్నారు.



ఏరులై పారనున్న మద్యం

డబ్బు తర్వాత ఎన్నికల్లో ప్రధానమైంది మద్యం. ఏపీలో ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్నాయి. దీంతో ఇష్టానుసారం కొనుగోలు చేసే వీలులేదు. దీంతో తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి భారీగా మద్యాన్ని డంప్ చేస్తున్నారు. మద్యం వ్యాపారులను సంప్రదించి అడ్వాన్స్ ఇచ్చి నెలన్నరపాటు రోజుకు ఎన్ని కేసుల మద్యం కావాలనేది చెప్పి సరఫరా చేయించుకుంటున్నారు. చెక్‌పోస్టులలోని పోలీసులను కూడా మచ్చిక చేసుకుని మద్యాన్ని సరిహద్దులు దాటిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగా ప్రచారంతో పాటు సాయంత్రం అయితే గ్రామస్థాయి నేతల ఇళ్ల వద్ద మద్యం జాతర నడుస్తోంది.

అధినేతల రాకతో హీటెక్కనున్న ప్రచారపర్వం

ఈనెల 28, 29న నంద్యాల, కర్నూలు జిల్లాలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి బస్సుయాత్రలో పాల్గొననున్నారు. 29న చంద్రబాబునాయుడు ఆత్మకూరు, నందికొట్కూరు, కర్నూలులో ప్రచారం చేయనున్నారు. అధినేతల రాకతో ఎన్నికల వేడి పెరిగింది. ఇప్పటికే 'గడప, గడప'కూ వెళ్లి ప్రజలతో వైఎస్సార్‌సీపీ దగ్గరైంది. తమ పాలన చూసి మంచి జరిగింటేనే ఓటు వేయాలని ఆ పార్టీ అభ్యర్థిస్తోంది. మరోవైపు 2014-19 చంద్రబాబు పాలనతో పాటు 14 ఏళ్లపాటు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు తిరిగి అలాంటి పాలనే అందిస్తారని చెప్పి ఓట్లు అడగలేని దీనపరిస్థితి టీడీపీది. ఓటర్లకు ఏం చెప్పి ఓట్లు అభ్యర్థించాలో కూడా దిక్కుతోచని పరిస్థితి. మరోవైపు కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలు కూడా ఈ దఫా ఎన్నికల్లో పోటీ చేయనున్నాయి. దీంతో అన్ని పార్టీలు ఎన్నికల హడావుడిలో నిమగ్నమయ్యాయి. ఎక్కడ నలుగురు కూర్చున్నా ఎన్నికల గురించిన చర్చే కొనసాగుతోంది.



బైరెడ్డి శబరి పేరిట వెలుగు చూసిన చీరలు



జగనన్న ఫ్యాన్స్

తెలుగు యువత అధికార ప్రతినిధి, జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ జిల్లా ప్రధాన కార్యదర్శి సనా నరసింహ సోమవారం వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీలో చేరారు. పార్టీ కార్యాలయంలో కర్నూలు అసెంబ్లీ అభ్యర్థి ఇంతియాజ్, మాజీ ఎమ్మెల్యే ఎస్వీ మోహన్‌రెడ్డి ఆయనకు పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. నరసింహతో పాటు తెలుగు యువతకు చెందిన సభ్యులు, జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు 400 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. - కర్నూలు సిటీ

మేమంతా సిద్ధం సభను విజయవంతం చేద్దాం

- జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి



కొలిమిగుండ్ల: ఈనెల 28న నంద్యాలలో సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హాజరయ్యే మేమంతా సిద్ధం సభను విజయవంతం చేయాలని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి కోరారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో జగనన్నను మళ్లీ సీఎంను చేసుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. త్వరలో ఎన్నికలు జరుగనుండటంతో టీడీపీ నాయకులు చేస్తున్న కుట్రలను తిప్పి కొట్టాలన్నారు. సమావేశంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి, జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు పేరం సత్యనారాయణరెడ్డి, సర్పంచ్‌ల సంఘం జిల్లా అధ్యక్షుడు లాయర్ మహేశ్వరరెడ్డి, నాయకులు సత్తిగారి రామిరెడ్డి, మూల ఈశ్వరరెడ్డి, తోట మల్లేశ్వరరెడ్డి, పెద్దిరెడ్డి, బీవీ జగన్ పాల్గొన్నారు.



తొట్ల వాగులో మోకాళ్లలోతు నీటిలో శవపేటికను తీసుకెళ్తున్న దళితులు (ఫైల్)



రూ. 4 లక్షలతో తొట్ల వాగుపై నిర్మించిన నూతన వంతెన


వంతెన వచ్చింది.. వేదన తీరింది

- వంతెన ఏర్పాటుతో తప్పిన తొట్ల వాగు తిప్పలు
- ఇస్కాల శ్మశాన వాటిక దారి సమస్యకు పరిష్కారం

దశాబ్దాలుగా ఇస్కాల దళితులను వేధిస్తున్న శ్మశాన వాటిక దారి సమస్య ఎట్టకేలకు పరిష్కారమైంది. ఎవరైనా చనిపోతే అంత్యక్రియల కోసం నడుములోతు నీరున్న తొట్ల వాగును దాటాల్సి వచ్చేది. గత ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదు. చివరికి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సమస్యను పరిష్కరించింది. వంతెన ఏర్పాటు చేసి శ్మశాన దారి సమస్య పరిష్కరించడంతో దళితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

పాములపాడు: మండల పరిధిలోని ఇస్కాల గ్రామంలో 150కి పైగా దళిత కుటుంబాలు ఉన్నాయి. గ్రామానికి 500 మీటర్ల దూరంలో శ్మశాన వాటికి ఉంది. వర్షాకాలంలో ఎవరైనా చనిపోతే అంత్యక్రియలు నిర్వహించాలంటే బతికి ఉన్నవాళ్లకు చచ్చినంత పనయ్యేది. వర్షాకాలంలో భవనాశి వాగు నుంచి ప్రవహించే నీరు తొట్ల వాగులోకి చేరి ఉధృతంగా ప్రవహించేది. ప్రాణాలు అరిచేతిలో పెట్టుకుని అతి కష్టం మీద శవాన్ని అవతలకు తీసుకెళ్లాల్సి వచ్చేది. దళితులు తమ సమస్యను గత ప్రభుత్వాల దృష్టికి లెక్కలేనన్ని సార్లు తీసుకెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి విజయం సాధించడంతో ఇచ్చి హామీ మేరకు రూ.4 లక్షల ఎంపీపీ నిధులతో తొట్ల వాగుపై వంతెన నిర్మించారు. దారి సమస్య పరిష్కారం కావడంతో దళితులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

కష్టం తప్పింది



తొట్ల వాగు మీద వంతెన కట్టడంతో కష్టాలు తప్పాయి. లేకపోతే చాలా ఇబ్బంది పడే వాళ్లం. మోకాళ్లలోతు నీళ్లలో శవ పేటికను మోసుకెళ్లడం అంటే నరక ప్రాయంగా ఉండేది. ఇప్పుడు ఆ సమస్య తప్పింది. - ప్రసాద్, ఇస్కాల

ఇచ్చిన మాట నిలబెట్టుకున్నాం



ఎన్నికల సమయంలో దళిత శ్మశాన వాటికకు వెళ్లేందుకు తొట్ల వాగుపై వంతెన నిర్మాణం చేపడతామని ఎన్నికల వేళ హామీ ఇచ్చాం. చెప్పినట్లుగానే వంతెనను నిర్మించాం. ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినియ నిధులు మంజూరు చేయడంతో సమస్య పరిష్కారమైంది.

- మౌలాలి, సర్పంచు, ఇస్కాల

ఎన్నిసార్లు అడిగామో అప్పట్లో



తొట్ల వాగుపై వంతెన నిర్మాణం చేపట్టాలని అప్పటి టీడీపీ ప్రభుత్వంలో అధికారులను, నాయకులనను ఎన్నిసార్లు అడిగినా ఎవరూ పట్టించుకోలేదు. స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో సమస్య పరిష్కారం కోసం వంతెన కట్టాలని వైఎస్సార్‌సీపీ నాయకులను అడిగాం. వారు గెలిచిన తరువాత వంతెన కట్టి మా సమస్యకు పరిష్కారం చూపారు.

- రవి, ఇస్కాల

దివ్యరథంపై దేవదేవుడు

- అంబరాన్నంటిన అహోబిలేశుడి రథోత్సవ సంబరం
- గోవింద నామస్మరణతో మార్మోగిన నల్లమల
- ఆకట్టుకున్న సాంస్కృతిక, జానపద, ఆధ్యాత్మిక కార్యక్రమాలు



రథోత్సవానికి తరలివచ్చిన అశేషజనం



రథంలో కొలువైన శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ ప్రహ్లాదవరదుడు

ఆళ్లగడ్డ: అహోబిల క్షేత్రంలో శ్రీ ప్రహ్లాదవరదుడు ఉభయ దేవేరులతో కలసి రథంపై నుంచి భక్తులకు అభయమిచ్చారు. సకల దేవతారాధకుడైన స్వామి వారు రథాన్ని అధిష్ఠించి అహోబిలం క్షేత్రం తిరువీధుల్లో విహరించారు. వేద పండితుల మంత్రోచ్చారణలు.. ఆస్థాన భజంత్రీల మంగళవాయిద్యాలు.. భక్తజన గోవిందా నామస్మరణతో నల్లమల గిరులు మార్మోగిపోయాయి. 108 వైష్ణవ క్షేత్రల్లో అత్యంత ప్రధాన క్షేత్రంగా కొనియాడుతున్న శ్రీ అహోబిల క్షేత్రంలో సోమవారం శ్రీ ప్రహ్లాదవరదుడి రథోత్సవం కనులపండువగా సాగింది. ముందుగా ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహించి పట్టు పీతాంబరాలతో ఆది దంపతులుగా ముస్తాబు చేసి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం ఉత్సవ మూర్తులను రథం వరకు ఊరేగింపుగా తోడ్కొని వచ్చారు. అప్పటికే వివిధ రకాల పుష్పాలతో నేత్రానంద పర్వంగా ముస్తాబు చేసిన రథంపై స్వామి, అమ్మవార్లను కొలువుంచారు. అహోబిల మఠం 46వ జియర్ శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్ శాస్త్రోక్తంగా రథాంగ పూజలు నిర్వహించి, భక్తులతో కలిసి రథోత్సవాన్ని ప్రారంభించారు. ఉత్సవం ఎదుట భక్తి పారవశ్యంతో నిర్వహించిన కోలాటాలు, హరి భజనలు, డప్పుల వాయిద్యాలు, బాజాభజంత్రీల మంగళ వాయిద్యాలు, డమురుక నాదాలు, కళాకారుల వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి. రథశాల వద్ద నుంచి క్షేత్రం మాడవీధుల్లో భక్తులకు దర్శనమిస్తూ దేవాలయం ఎదురుగా వచ్చే వరకు రథోత్సవం వైభవంగా కొనసాగింది.

చంద్రబాబు నాయుడుకు మందకృష్ణ మద్దతివ్వడం సిగ్గుచేటు



● వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మద్దయ్య

మాట్లాడుతున్న సీహెచ్ మద్దయ్య

కర్నూలు (టౌన్): 'ఎవరైనా ఎస్సీలుగా పుడతారా' అని దళితులను అవమానపరిచిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడికి మందక్రిష్ణ మాదిగ మద్దతివ్వడం సిగ్గుచేటని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ మద్దయ్య అన్నారు. పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ చేయకుండా గతంలో చంద్రబాబు మోసం చేశారని, ఎన్నికల సమయంలో ఆయనకు మద్దతు ఇవ్వడం మాదిగలకు ద్రోహం చేసినట్లు అవుతుందన్నారు. ఎస్సీ వర్గీకరణ కేంద్రం చేయాల్సి ఉందని, వర్గీకరణ చేస్తే ముందుగా సంతోషపడేది తానేనని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి స్పష్టం చేశారన్నారు. ఎస్సీ వర్గాలపై చిత్తశుద్ధి ఉంది కాబట్టే విజయవాడ నడిబొడ్డున రూ.440 కోట్లతో బాబా సాహెబ్ అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేశారన్నారు. ఏనాడైనా చంద్రబాబుకు ఈ ఆలోచన అన్న వచ్చిందా అని ప్రశ్నించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా జిల్లాలో 48 వేల మంది ఎస్సీ మహిళలకు ఆర్థికంగా చేయూత లభించిందన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలనలో రాష్ట్రంలో నిజమైన ఎస్సీ సంక్షేమం జరిగిందన్నారు. ఇంటింటికీ వెళ్లి సేవలందిస్తున్న వలంటీర్లను టెర్రరిస్టులంటూ టీడీపీ నేతలు వ్యాఖ్యానించడం తగదన్నారు. వలంటీర్లను విమర్శించిన వారికి రాజకీయ సమాధి తప్పదని హెచ్చరించారు. విలేకరుల సమావేశంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సందెపోగు శివ, పార్టీ సంయుక్త కార్యదర్శి సుచరిత, పార్టీ నాయకులు రాజు, అశోక్, చెన్నమ్మ, రాజేష్, మనోహర్ పాల్గొన్నారు.

నిఘా పటిష్టం.. భద్రత కట్టుదిట్టం

● ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పోలీసు యంత్రాంగం చర్యలు
● సమస్యాత్మక ప్రాంతాల్లో బలగాల కవాతు
● చెక్‌పోస్టుల్లో ముమ్మరంగా తనిఖీలు



మాధవరం చెక్‌పోస్టు వద్ద వాహన తనిఖీలను పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణకాంత్

కర్నూలు: ప్రశాంత ఎన్నికలే లక్ష్యంగా పోలీస్ ఉన్నతాధికారులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలుగకుండా పటిష్ట భద్రత ఏర్పాట్లు చేస్తున్నారు. పికెట్లు ఎక్కడ పెట్టాలనేది సబ్ డివిజన్ల వారీగా నిర్ధారించి అమలు చేస్తున్నారు. ఎక్కడా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నియమిస్తున్నారు. ఇప్పటికే డీఐజీ విజయరావు రేంజ్ పరిధిలోని అధికారులతో, ఎస్పీ కృష్ణకాంత్ జిల్లా పోలీసు అధికారులతో సమీక్షలు నిర్వహించారు. ఫ్యాక్షన్ ప్రభావిత, సమస్యాత్మక, సున్నిత ప్రాంతాలు గుర్తించారు. ఆయా ప్రాంతాల్లో ఎలాంటి బందోబస్తు చర్యలు చేపట్టాలనే అంశాలపై చర్చించారు. ధన ప్రవాహం, కానుకల పంపిణీకి అడ్డుకట్ట వేసేందుకు అవసరమైన తనిఖీ కేంద్రాలు ఏర్పాటు చేశారు. గత ఎన్నికల అనుభవాలను దృష్టిలో ఉంచుకుని జిల్లాలో స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలు మొహరించాయి. ఇప్పటికే శాసనసభ నియోజకవర్గాల వారీగా విధులు నిర్వహిస్తున్నాయి. జిల్లా, మండల కేంద్రాలతో పాటు సమస్యాత్మక ప్రాంతాల్లో తొలి దఫా కవాతు నిర్వహించాయి.

తనిఖీలు ముమ్మరం

సార్వత్రిక ఎన్నికల వేళ అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో ఉన్న పంచలింగాల, సుంకేసుల, ఛత్రగుడి, పెద్దహరివాణం, మాధవరం, బాపురం, నాగులదిన్నె, హొళగుంద చెక్‌పోస్టులలో నిఘా పెంచారు. ఎస్పీ కృష్ణకాంత్, డీఐజీ విజయరావు చెక్‌పోస్టులను ఆకస్మిక తనిఖీ చేస్తూ.. సిబ్బందిని అప్రమత్తం చేస్తున్నారు. పొరుగు రాష్ట్రాలు కర్ణాటక, తెలంగాణ నుంచి జిల్లాలోకి అక్రమంగా మద్యం, డబ్బు రాకుండా భద్రత కట్టుదిట్టం చేశారు. ఆయా చెక్‌పోస్టులలో మూడు షిఫ్టులలో సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అలాగే స్టేషన్ల వారీగా కూడా పోలీసులు వాహన తనిఖీలు ముమ్మరం చేశారు.

ఆధారాలు ఉండాల్సిందే...

రూ.50 వేలకు మించి నగదు, బంగారం, వెండి, ఇతర విలువైన వస్తువులు తీసుకెళ్తే పరిశీలిస్తున్నారు. ఆధారాలు చూపకుంటే వెంటనే స్వాధీనం చేసుకుంటున్నారు. స్టేషన్ అధికారులతో పాటు అంతర్‌రాష్ట్ర, జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేశారు. ఎన్నికల నియమావళిని అనుసరించి పెద్ద మొత్తంలో నగదు, విలువైన వస్తువులు తరలించేవారు తప్పకుండా ఆధారాలను వెంట తీసుకెళ్లాలని జిల్లా ప్రజలకు పోలీసు అధికారులు సూచిస్తున్నారు.

చెక్‌పోస్టులలో నిఘా పెంచాం



జిల్లాలోని అన్ని చెక్‌పోస్టులలో మూడు షిఫ్టులలో పోలీసు అధికారులు, సిబ్బందితో నిఘా పెంచాం. విలువైన వస్తువులకు రశీదు తప్పనిసరిగా ఉండాలి. ఆధారాలు చూపితే పరిశీలించి నిబంధనల మేరకు పట్టుబడిన వాటిని అందిస్తాం. జిల్లాలోకి అక్రమంగా ఏమీ రాకుండా భద్రతను మరింత కట్టుదిట్టం చేస్తాం. నిరంతరం సిబ్బంది విధుల్లో ఉండి ప్రతి వాహనాన్ని తనిఖీ చేసి అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– కృష్ణకాంత్, ఎస్పీ

సాక్షి ఉద్యోగ అవకాశాలు
ప్రతి మంగళ, శుక్రవారములలో

WANTED
(1) Asst. Manager (AM):
Qly: Any Graduation 3-5 Years Experience on retail/Hotel industry.
(2) Operation Associates (M) :
Qly : Inter.
SVC CINEMAS
SVC CINEMAS PVT. LTD
3rd Floor, City square Mall, Kurnool.
Call@Time: 11am to 5pm
9849965867

బంగారుపేటలో సెబ్ దాడులు



నాటుసారా స్థావరాలపై దాడులు చేసి సామగ్రిని స్వాధీనం చేసుకున్న సెబ్ పోలీసులు

కర్నూలు: స్థానిక బంగారుపేటలోని నాటుసారా స్థావరాలపై కర్నూలు సెబ్ స్టేషన్ సిబ్బంది దాడులు నిర్వహించారు. కేసీ కెనాల్ వెంట ఉన్న నాటుసారా బట్టీలను ధ్వంసం చేసి సారా తయారీకి సిద్ధంగా ఉంచిన 1800 లీటర్ల బెల్లం ఊట, 30 లీటర్ల నాటుసారాను పారవేశారు. అదే ప్రాంతానికి చెందిన షికారి హేమ వద్ద 20 లీటర్లు, షికారి గులాల్ వద్ద 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకుని ఇరువురినీ అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు సీఐ కేఆర్ రాజేంద్రప్రసాద్ తెలిపారు. దాడుల్లో ఎస్‌ఐలు రెహనా బేగం, మారుతీ ప్రసాద్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

Sri Konda Reddy Educational Society
SDR WORLD SCHOOL
School of Developing Representative
WALK - IN INTERVIEW

LECTURERS FOR IIT FOUNDATION SCHOOL FOUNDATION IIT, JEE (MAINS), NEET LEVEL	All Subjects	50,000-80,000
SECONDARY SCHOOL TEACHERS (CBSE) IX & X	All Subjects	35,000-55,000
MID SCHOOL TEACHERS (CBSE) VI, VII & VIII	All Subjects	25,000-40,000
PRIMARY SCHOOL TEACHERS (CBSE) I & V	All Subjects	20,000-35,000
PRE-PRIMARY TEACHERS	Min.5 Years Exp.	18,000-25,000
CHIEF WARDENS	Any Degree (Min 3 Years Exp.)	20,000-25,000

Also Required
WARDENS, CLASS INCHARGES, RECEPTIONISTS, PET'S AND PRO'S
(Salary commensurate with qualification and experience)
INTERVIEWS WILL BE CONDUCTED
ON 30 (Sat), 31 (Sun) MARCH 2024.
Contact for Interview
NEAR PETROL FILLING STATION, VENKATESWARAPURAM, NANDYAL, ANDHRA PRADESH - 518 502
97033 03853, 99669 84433
Send your resume on this mail id
email:sdrdocs0@gmail.com / www.sdrworldschool.in

బైకులను దొంగిలించి.. షెడ్డులో దాచి!



స్వాధీనం చేసుకున్న బైకులను చూపుతున్న సీఐ, ఎస్‌ఐ, పోలీస్ సిబ్బంది

● అంతర్ జిల్లా దొంగల ముఠా గుట్టు రట్టు చేసిన పోలీసులు
● 16 మోటారు సైకిళ్లు స్వాధీనం
● ఒకరి అరెస్ట్.. మరో ఇద్దరి కోసం గాలింపు
● కేసులో చొరవ చూపిన ఎస్‌బీ కానిస్టేబుల్‌కు రివార్డు

వెల్దుర్తి(కృష్ణగిరి): కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో బైకులను దొంగలించి, షెడ్డులో దాచి ఉంచిన అంతర్ జిల్లా దొంగల ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. మోటారు సైకిళ్ల చోరీకి పాల్పడిన దొంగను అరెస్ట్ చేసి, 16 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సీఐ సురేశ్ కుమార్ రెడ్డి, ఎస్‌ఐ చంద్రశేఖర్ రెడ్డి వివరాలు వెల్లడించారు. కృష్ణగిరి మండలం ఎరుకల చెరువులో ఆ గ్రామానికి చెందిన వన్నూరు అశోక్ కుమార్ రేకుల షెడ్డులో 16 చోరీకి గురైన మోటార్ సైకిళ్లను ప్యాపిలి మండలం మాధవరం గ్రామానికి చెందిన దర్శినేని నాగభూషణ్ దాచి ఉంచారు. పక్కా సమాచారంతో పోలీసులు అక్కడికి చేరుకుని హోండా షైన్ బైకులు 10, హీరో స్ప్లెండర్, ప్యాషన్‌ప్రో, హెచ్‌ఎఫ్ డీలక్స్, బజాజ్ ప్లాటినా, టీవీఎస్ స్టార్‌సిటీ ప్లస్, స్టార్ స్పోర్ట్ బైకులు ఒక్కొక్కటి చొప్పున స్వాధీనం చేసుకున్నారు. అక్కడే ఉన్న దర్శినేని నాగభూషణ్‌ను అరెస్ట్ చేశారు. అతన్ని విచారణ జరపగా... డోన్ మండలం రేకులకుంట గ్రామానికి చెందిన బెస్త వెంకటేష్‌తో కలిసి తాను పలు జిల్లాలలో బైక్‌లు చోరీ చేసినట్లు అంగీకరించారు. ఆ బైక్‌లను అమ్మేందుకు ఎరుకులచెరువు గ్రామానికి చెందిన అశోక్ షెడ్డులో దాచి ఉంచామన్నారు. నాగభూషణ్‌తో పాటు బెస్త వెంకటేష్, అశోక్‌లపై కేసు నమోదు చేసి, అరెస్ట్ చేసిన నాగభూషణ్‌ను డోన్ కోర్టులో హాజరుపరచగా జడ్జి రిమాండ్‌కు ఆదేశించినట్లు సీఐ తెలిపారు. మిగిలిన ఇద్దరు నిందితుల కోసం గాలిస్తున్నామన్నారు. స్వాధీనం చేసుకున్న బైక్‌ల విలువ సుమారు రూ.6 నుంచి రూ. 7లక్షల వరకు ఉండవచ్చన్నారు. ఆర్‌టీఓ ద్వారా బైక్‌ల వివరాలు సేకరించి, వాటి యజమానులకు అప్పగిస్తామన్నారు. పక్కాగా సమాచారం అందించిన స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ ఖాజాను ఈ సందర్భంగా వారు నగదు రివార్డుతో సత్కరించారు.

హిటాచీ సీజ్



కర్నూలు (న్యూటౌన్): ఏపీ సరిహద్దులో అక్రమంగా చొరబడి సాగునీటి కోసం కాల్వ తవ్వుతున్న హిటాచీని సీజ్ చేసినట్లు జిల్లా మైనింగ్ డిప్యూటీ డైరెక్టర్ రాజశేఖర్ తెలిపారు. అక్రమంగా కాల్వ తవ్వుతున్నారనే సమాచారంతో కంబాలి ఇసుక రీచ్‌ను ఆదోని సబ్ కలెక్టర్ శివకుమార్ శర్మ ఆధ్వర్యంలో జిల్లా మైనింగ్ డీడీ రాజశేఖర్, కౌతాళం తహసీల్దార్ అలెగ్జాండర్ సోమవారం తనిఖీ చేశారు. డీడీ మాట్లాడుతూ ఏపీ సరిహద్దులోని కౌతాళం మండలం మర్లీ గ్రామ పరిధిలో అక్రమంగా ప్రవేశించిన మాన్వికి చెందిన రైతు ఎల్లప్ప సాగునీటి కోసం కాల్వ తవ్వుతుండగా హిటాచీని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు.

బడుగుల భవిష్యత్తుకు వైఎస్సార్‌సీపీ పునాది

● కూటమి అభ్యర్థులను చిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారు
● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్



మాట్లాడుతున్న జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్

కర్నూలు (టౌన్): బడుగుల భవిష్యత్తుకు వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ పునాది వేసిందని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మద్దూరు సుభాష్ చంద్రబోస్ అన్నారు. సి. క్యాంపులోని తన కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఐదేళ్ల పాలనా కాలంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, నిరుపేదలందరి అభ్యున్నతికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విస్తృతంగా సంక్షేమ పథకాలు అమలు చేశారన్నారు. ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా, ఎమ్మెల్సీలుగా, రాజ్యసభ సభ్యులుగా గతంలో కంటే ఎక్కువ మంది బడుగు, బలహీన వర్గాల వారికి అవకాశం కల్పించారన్నారు. రాజ్యాధికారంలో బడుగులను భాగస్వాములను చేసి.. జ్యోతిరావు పూలే, అంబేద్కర్ ఆశయాలను సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాధించారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా బడుగు వర్గాల్లోని ప్రతి కుటుంబానికీ సంక్షేమ పథకాలు అందాయన్నారు. మరింత సంక్షేమం కోసం వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని గెలిపించి, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకుందామని పిలుపునిచ్చారు. ఇటీవల నిర్వహించిన సిద్ధం సభలకు ప్రజలు తరలిరావడం చూస్తే వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయం నల్లేరుపై నడకే అన్న విషయం అర్థమవుతుందన్నారు. కూటమి అభ్యర్థులను చిత్తుచిత్తుగా ఓడించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, చంద్రబాబును నమ్ముకున్న వాళ్లకు ఈ ఎన్నికల్లో నిరాశ తప్పదన్నారు. ఎన్నికల తరువాత చంద్రబాబు , పవన్ కళ్యాణ్‌కు రాజకీయ సన్యాసం తప్పదని, హైదరాబాద్‌కు పరిమితం కావడం ఖాయమన్నారు. విలేకరుల సమావేశంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు రాముడు, బోయ నాయుడు, గాలి రాజు పాల్గొన్నారు.

అక్రమ మద్యంపై ఉక్కుపాదం

● కోడుమూరు సెబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య



కోడుమూరు సెబ్ స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

కోడుమూరు రూరల్: ఎన్నికల దృష్ట్యా జిల్లాలో అక్రమ మద్యం రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నట్లు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. సోమవారం కోడుమూరు సెబ్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలోని కేసుల వివరాలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం నిల్వ చేసే గోదాములు, రవాణా కేంద్రాలను ఎప్పటికప్పుడు తనిఖీ చేయాలన్నారు. పాత నేరస్తులపై నిఘా పెంచాలని, బార్డర్ చెక్ పోస్టులను మరింత బలోపేతం చేసి అక్రమ మద్యాన్ని కట్టడి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో ఇప్పటి వరకు సెబ్ సిబ్బంది 354 కేసులు నమోదు చేయడంతో పాటు 5125లీటర్ల నాటు సారా స్వాధీనం చేసుకుని 1.94 లక్షల లీటర్ల బెల్లం ఊటను ధ్వంసం చేసినట్లు సెబ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య తెలిపారు. అలాగే ఇతర రాష్ట్రాల నుంచి అక్రమ మద్యం రవాణా చేస్తున్న వారిపై 410 కేసులు నమోదు చేసి, 8,084 లీటర్ల మద్యాన్ని స్వాధీనం చేసుకుని 465మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. 826కేసుల్లో 101వాహనాలను సీజ్ చేశామన్నారు. డిప్యూటీ కమిషనర్ వెంట కర్నూలు సెబ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ నరసనాయుడు, సెబ్ సీఐ రామాంజినేయులు, ఎస్‌ఐ అలీ బేగ్ ఉన్నారు.



రంగంలోకి ఎన్నికల బృందాలు

● రాజకీయ పార్టీల ప్రచారంపై నిఘా
● ప్రలోభాలు నివారించడమే లక్ష్యం
● పటిష్టంగా ఎన్నికల నియమావళి అమలు



కర్నూలు(సెంట్రల్): ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు వివిధ బృందాలు రంగంలోకి దిగాయి. రాజకీయ పార్టీల ప్రచారంపై నిఘాను పెంచాయి. ఎన్నికల్లో నగదు, మద్యం, ఇతర బహుమతుల ప్రమేయాన్ని నివారించడమే లక్ష్యంగా ఈ బృందాలు పనిచేస్తున్నాయి. ఎన్నికల నియమావళి అమలు పర్యవేక్షిస్తున్నాయి. అన్ని బృందాలకు బాధ్యతలు, విధులపై శిక్షణ ఇచ్చారు. వివిధ బృందాల పని తీరు ఏంటో చూద్దాం...

మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్(ఎంసీసీ)...

ఎన్నికలను శాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు ఏర్పాటు చేసిన టీమ్‌ల్లో మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్ టీమ్ ముఖ్యమైంది. రాజకీయ పార్టీలు, అభ్యర్థులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తూచా పాటించే విధంగా చూడటమే లక్ష్యంగా ఈ టీమ్ ఏర్పాటైంది. ప్రతి మండలానికి, ప్రతి మున్సిపాలిటీకి ఎంసీసీ టీమ్‌లు ఏర్పాటయ్యాయి. రేయింబవళ్లు పనిచేసే విధంగా ప్రతి మండలానికి మూడు టీమ్‌లు ఏర్పాటయ్యాయి. మండల స్థాయిలో ఈ టీమ్‌కు ఎంపీడీవో నేతృత్వం వహిస్తారు. మున్సిపాలిటీలో కమిషనర్ ఆధ్వర్యంలో పనిచేస్తాయి. ఈ టీమ్‌లో ఒక పోలీసు, ఒక వీడియోగ్రాఫర్ ఉంటారు. రాజకీయ పార్టీలు, అభ్యర్థుల ఎన్నికల ప్రచారంలో ఈ టీమ్ సభ్యులు నీడలా అనుసరిస్తారు. కోడ్ ఉల్లంఘనలకు సంబంధించి ప్రతి విషయాన్ని వీడియో తీసి రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎన్నికల అధికారికి నివేదిస్తారు. దీని ఆధారంగా కోడ్‌ను ఉల్లంఘించిన పార్టీలకు, అభ్యర్థులకు నోటీసులు ఇస్తారు. వాటికి వారు ఇచ్చే సమాధానాలను బట్టి తదుపరి చర్యలు తీసుకుంటారు. కర్నూలులో 3, పాణ్యంలో 5, పత్తికొండలో 5, కోడుమూరులో 5, ఎమ్మిగనూరులో 4, మంత్రాలయంలో 4,ఆదోనిలో 3, ఆలూరులో 6 మొత్తం 35 ఎంసీసీ బృందాలు పనిచేస్తున్నాయి.

స్టాటిస్టికల్ సర్వేలైన్స్..

స్టాటిస్టికల్ సర్వేలైన్స్ టీమ్‌లు చెక్‌పోస్టుల దగ్గర ఉంటాయి. జిల్లాలో మొత్తం 64 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. ఆ సంఖ్యకు అనుగుణంగా 64 స్టాటిస్టికల్ సర్వేలైన్స్‌టీమ్‌లను నియమించారు. ఈ టీమ్‌లు కూడా రేయింబవళ్లు పనిచేస్తాయి. ఇందులో రెవెన్యూ, పోలీసు, ఎక్సైజ్, వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, వీడియోగ్రాఫర్ ఉంటారు. ఎన్నికల్లో నగదు, మద్యం, ఇతర విలువైన వస్తువుల అక్రమ రవాణాను అరికట్టేందుకు ఈ టీమ్‌లను ఏర్పాటు చేశారు. ఎటువంటి వివరాలు లేకుండా నగదు, మద్యం, ఇతర వస్తువులను రవాణా చేస్తే సీజ్ చేస్తారు. ఇప్పటికే చెక్‌పోస్టుల్లో తనిఖీలు మొదలయ్యాయి. జిల్లాలో కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గానికి సంబంధించి 9, పాణ్యంలో 12, పత్తికొండలో 9, కోడుమూరులో 12, ఎమ్మిగనూరులో 9, మంత్రాలయంలో 9, ఆదోనిలో 9, ఆలూరులో 9 మొత్తం78 స్టాటిస్టికల్ సర్వేలైన్స్ టీమ్‌లు పనిచేస్తున్నాయి.

వీడియో వీవింగ్..

వీడియో వీవింగ్ టీమ్... అభ్యర్థులు, వీరి తరఫున ప్రచారం చేసే వీఐపీలను నీడలా వెంటాడుతుంది. ప్రతి అంశాన్ని వీడియో తీసి జిల్లా ఎన్నికల పరిశీలకులకు సమర్పిస్తాయి. అభ్యర్థులు, ఇతర వీఐపీల కదలికలను ఈ టీమ్ తమ వీడియోలో చిత్రీకరిస్తుంది. ప్రతి మండలానికి ఈ టీమ్‌లను ఏర్పాటు చేశారు. సూపరింటెండెంట్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో ఈ వీడియో వీవింగ్ టీమ్‌లు పనిచేస్తాయి.

మీడియా మానిటరింగ్ సర్టిఫికేషన్..

మీడియా మానిటరింగ్ సర్టిఫికేషన్ (ఎంసీఎంసీ) టీమ్ జిల్లా స్థాయిలో ఉంటుంది. ఈ కమిటీకి జిల్లా కలెక్టర్ నేతృత్వం వహిస్తారు. ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా, సోషల్ మీడియాలో వచ్చే వార్తలను ఈ కమిటీ పరిశీలిస్తుంది. పెయిడ్ న్యూస్‌గా భావిస్తే నోటీసులు ఇస్తారు. ఎన్నికలకు సంబంధించిన ప్రకటనలను ముందుగా ఎంసీఎంసీ టీమ్‌కు సమర్పించి అనుమతి తీసుకోవాల్సి ఉంది. ప్రతి రోజు టీమ్ సభ్యులు కలెక్టర్‌తో సమావేశమై పత్రికలు, టీవీల్లో వచ్చే కథనాలను పరిశీలిస్తారు. ఎలక్ట్రానిక్ మీడియాకు వర్తించే నిబంధనలన్నీ సోషల్ మీడియాకు వర్తిస్తాయి.

ఫ్లైయింగ్ స్క్వాడ్..

ఎన్నికల సమయంలో ఫ్లైయింగ్ స్క్వాడ్ పాత్ర ఎక్కువగా ఉంటుంది. ఇందులో పోలీసు అధికారి, ఇతర శాఖల అధికారులు, వీడియో గ్రాఫర్ ఉంటారు. కర్నూలులో 6, పాణ్యంలో 12, పత్తికొండలో 10, కోడుమూరులో 8, ఎమ్మిగనూరులో 8, మంత్రాలయంలో 8, ఆదోనిలో 6, ఆలూరులో 10.. మొత్తం 64 ఫ్లైయింగ్ స్క్వాడ్‌లు ఏర్పాటు చేశారు. తమ పరిధిలో ఏ చిన్న సంఘటన జరిగిన ఫ్లైయింగ్ స్క్వాడ్ అక్కడ ప్రత్యక్షం అవుతుంది. మద్యం అక్రమ రవాణా నియంత్రణ, శాంతిభద్రతల లక్ష్యంగా ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశారు.

సాక్షి క్లాసిఫైడ్స్

AUTOMOBILES
VEHICLES FOR SALE
■ గొప్ప శుభవార్త! ప్రతి TVS వెహికల్ కొనుగోలుపై 4850/- నుండి 10,000/- వరకు ఖచ్చితమైన ఆఫర్ కలదు. ఈ అవకాశం కొద్ది రోజుల వరకు మాత్రమే. అంతేకాకుండా అతి తక్కువ డౌన్‌పేమెంట్ సౌకర్యం కలదు. శ్రీ సాయి TVS నంద్యాల. సెల్: 93815 74877, 91826 31593 [L-822467]

EDUCATION
COMPUTER EDUCATION
■ NICE Computers: Summer Computer Courses, MS Office, DTP, Tally, C, C++, Java, PGDCA, Spoken English etc., V.R.Colony, 1st Lane, KNL. Cell: 93968 61308. [L-822473]

ADMISSIONS
■ B.A.5,500, B.Com-6k, B.Sc-10k, P.G.Arts-8k. yearly in Distance at PLNM Degree college ✆ 91774 08565/ 9642656449.M.B.A-16k,MCA-20k. Sem.Admns Last Date: 25/3/24. Penalty Fee: 26th-30th March. [G-801057]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు సంప్రదించండి
70750 09185
70750 09165

REAL ESTATE
HOUSE FOR SALE
■ కర్నూలు - డోన్ రోడ్ రిడ్జ్ స్కూల్ దగ్గరలో ఓపెన్ ప్లాట్లు మరియు ఇండిపెండెంట్ హౌసెస్ తక్కువ ధరలో అన్ని డెవలప్‌మెంట్స్‌తో కలవు. సం.ప్ర: 98852 66558. [L-822474]

SERVICES
ASTROLOGY
■ రుద్ర నాడీ జ్యోతిష్యాలయం. మీ బొటన వేలి గుర్తును బట్టి, పుట్టిన తేదీ ఆధారంగా మీ యొక్క భవిష్యత్తు చెప్పి పరిష్కారం చూపబడును. సాయిబాబా గుడి దగ్గర, పాతబస్టాండ్, కర్నూలు. 8309209485 [L-822472]

శివశక్తి జ్యోతిష్యాలయం
■ ఉచిత జ్యోతిష్యం. ఉద్యోగం, వ్యాపారం, అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులు, కుటుంబ కలహాలు, వశీకరణం. ఇంకా ఎటువంటి సమస్యలున్నా 3 రోజుల్లో శాశ్వత పరిష్కారం చూపబడును. సెల్ : 76767 03640 [A-784600]

బంగారం కొనబడును
■ మీ బంగారం, వెండి, డైమండ్స్ బ్యాంక్స్ / ఫైనాన్స్‌లో తాకట్టులో ఉన్నవి మా డబ్బుతో విడిపించి కొనబడును స్పాట్ క్యాష్ / షిఫ్టింగ్ (రిటైర్డ్ పోలీస్ డిపార్ట్‌మెంట్) గోల్డ్‌ట్రేడింగ్ కం. ఫోన్ : 73821 14647 [V-6439]

BUSINESS OFFER
■ ద్వారకా ఎంటర్‌ప్రైజెస్‌పేపర్ ప్లేట్ & LED మిషన్స్‌పై ప్రతినెల అధిక ఆదాయం, అద్భుత అవకాశం ఉచిత ముడిపదార్థాలు 100% తిరిగి కొనుగోలు ఒప్పందం. 9310515624, 8800496710 [G-1454]

WANTED
■ డోన్ KVS హాస్పిటల్ నందు పని చేయుటకు MBBS, BUMS, BHMS, BAMS డాక్టర్లు (M/F) కావలెను. డాక్టర్ సెల్: 9533119937, PRO: 9966376749. [L-806463]
■ AP TS NEWS APP JOBS SERVICES: విలేకరులు, ఫిమేల్ టెలికాలర్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ మేనేజర్లు, కంప్యూటర్ ఆపరేటర్, యాంకర్ కావలెను. సెల్: 99666 76646. [L-806461]
■ నంద్యాల రాపిడో బైక్ టాక్సీలో రైడర్‌గా జాయిన్ అవ్వండి. రోజుకి రూ.600/- వరకు సంపాదించండి. అర్హత: ఆండ్రాయిడ్ మొబైల్, సి.బుక్, లైసెన్స్ సెల్: 04440115193. [T-764047]
■ Wanted Sales Manager For a Reputed CO., @ Kurnool. With Min 3 Yrs Exp, Graduate / MBA, Age : Below 35 Yrs. Sal : 20,000+ Alw + Inc. Ph : 95734 94949, viksarguardwel@gmail.com. [V- 11847]
■ హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి + భోజనం జీ. 18k. ఫోన్: 9640258899 / 9640468899 [HA-1389]
■ కష్టమైన్ కాదు VIP ఇంట్లో పెద్దవాళ్లని చూసుకోవడానికి స్త్రీలు/పురుషులు ఆయా, నర్సులు, వంటచేయువారు, RMP & డాక్టర్స్ కావలెను. జీ: 15000 - 40000, ఫ్రీ రూమ్+భోజనం. HYD, Ph: 7993583999 [HA-1407]
■ షిర్డీసాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో పనిచేయుటకు లేడీ సూపర్‌వైజర్స్, నర్సులు, ఆయాలు, డ్రైవర్స్, భార్యాభర్తలు కావలెను. ఫోన్: 9391036931, 9246585901. [HA-13624]

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.